తిరుమల శ్రీవారి ఆలయం అనగానే మన కళ్లముందు కనిపించేది బంగారు రంగులో మెరిసిపోయే ఆనంద నిలయం. ఈ ఆనంద నిలయ గోపురం.. ఇందులోని ప్రతిమలు.. ప్రత్యేకతలు అందరికీ ఆసక్తికరమే. అలాంటి 'ఆనంద నిలయం కథ' ఏంటనేది 10వ పేజీలో చూద్దాం.






ముక్కంటి సేవలో విదేశీ భక్తులు

శ్రీకాళహస్తీశ్వరుడిని శుక్రవారం పలువురు విదేశీ భక్తులు దర్శించుకున్నారు. రష్యాకు చెందిన ఏడుగురు, కజికిస్తాన్‌కు చెందిన ముగ్గురు, టర్కీ దేశవాసులు ఐదుగురు.. మొత్తం 15మంది ఆలయానికి వచ్చారు. రూ.500 రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

\- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

● రూ. వంద సభ్యత్వంతో బీమా వర్తింపు

తిరుపతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుకు శనివారం నుంచి శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే నియోజకవర్గ స్థాయిలో సభ్యత్వ నమోదుపై నాయకులకు శిక్షణ ఇచ్చిన సంగతి తెలిసిందే. గతంతో పోలిస్తే ఇటీవల ఎన్నికల్లో అద్భుత విజయంతో పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు. దీంతో అంచనాలకు మించి సభ్యత్వ నమోదు విజయవంతమవుతుందని పార్టీ భావిస్తోంది. కూటమి అధికారంలో ఉన్నందున గుర్తింపు కోసం క్రియాశీలక కార్యకర్తలు, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు పోటాపోటీగా సభ్యులను చేర్పించేందుకు కృషి చేసే అవకాశం కనిపిస్తోంది. ఇక, పదవులు ఆశిస్తున్న వాళ్లు చురుగ్గా పాల్గొనేందుకు ఆస్కారముంది. మరోవైపు జిల్లాలో తిరుపతి మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నందున సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పోటాపోటీగా, బల నిరూపణగా పరిగణించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకునే రాష్ట్ర పార్టీ కూడా జిల్లా, నియోజకవర్గాల వారీగా గతానికి మించి లక్ష్యాలను నిర్దేశించింది. అధికారంలో ఉన్నందున కూటమి ప్రభుత్వం హామీలను ఒకటొకటిగా నెరవేరుస్తున్న వైనం, అలాగే కొత్తగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్న విధానం గురించి ప్రజల్లోకి తీసుకెళ్ళి సభ్యులుగా చేర్పించాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

జీవకోన గంగమ్మ ఆలయం వద్ద ప్రారంభం

తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి జీవకోన రాజీవ్ గాంధీ కాలనీలోని గంగమ్మ గుడి వద్ద శనివారం ఉదయం 10.30 గంటలకు టీడీపీ సభ్యత్వ నమోదును ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ప్రారంభించనున్నారు. సాధారణ సభ్యత్వం కాకుండా రూ.100 చెల్లించి తీసుకునే క్రియాశీలక సభ్యత్వానికి పార్టీ అదనపు ప్రయోజనాలు కల్పిస్తోంది. ఈ సభ్యత్వం తీసుకున్న వారికి రూ. 5 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుంది. సాధారణ మరణం సంభవిస్తే వారికి పార్టీ రూ. 10 వేలు చొప్పున చెల్లిస్తుంది.



నకిలీ పత్రాలతో బ్యాంకుకు బురిడీ

● ఎస్‌బీఐ అనుబంధ ఎస్ఎంఈ బ్రాంచిలో రూ.2.8 కోట్ల రుణం
● ఆపై పరిశ్రమ ఏర్పాటు చేయని వైనం
● పోలీసులను ఆశ్రయించిన అధికారులు
● ఆలస్యంగా వెలుగులోకి..

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యుమెంట్లతో బ్యాంకు అధికారులనే బురిడీ కొట్టించారు. పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నట్లు రూ.2.8 కోట్లు తీసుకుని.. పత్తాలేకుండా పోయారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో తిరుపతి క్రైం పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. రేణిగుంట మండలం వెంకటాపురం వద్ద లక్ష్మీ నరసింహ ఇండస్ట్రీ పేరిట ఫ్లోర్ క్లీనింగ్ క్లాత్‌ల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు చిలకలూరిపేట, నరసారావుపేటకు చెందిన కొందరు ప్లాన్ చేశారు. దీనికి బ్లూ ప్రింట్లు, స్థలానికి సంబంధించి ఈసీ, మూల పత్రాలు తదితరాలను సిద్ధం చేసుకున్నారు. పరిశ్రమల శాఖ అనుమతుల కోసం దరఖాస్తు చేయగా.. ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు రాలేదు. ఇక, తిరుపతి బాలాజీ కాలనీలో స్టేట్ బ్యాంకుకు అనుబంధంగా ఎస్ఎంఈ బ్రాంచి ఉంది. ఇక్కడ చిన్న తరహా.. కుటీర పరిశ్రమలు, చేతివృత్తుల వారికి రుణాలు మంజూరు చేస్తారు. దీంతో వీరు ఎస్ఎంఈ బ్రాంచ్‌ని సంప్రదించారు. రుణానికి అవసరమైన డాక్యుమెంట్లు, భూమి పత్రాలను సమర్పించారు. బ్యాంకు అధికారులు కూడా పరిశ్రమను ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. నిబంధనల మేరకు అన్నీ సక్రమంగా ఉన్నాయని రెండేళ్ల కిందట రూ.2.80 కోట్ల రుణం మంజూరు చేశారు.

అసలు విషయం వెలుగు చూసిందిలా..

రుణం తీసుకుని రెండేళ్ళు కావస్తున్నా అక్కడ పరిశ్రమ స్థాపించలేదు. సకాలంలో రుణ కంతులనూ చెల్లించలేదు. దీనిపై బ్యాంకు అధికారులు ఆరా తీశారు. మరోవైపు బ్యాంకులో తాకట్టు పెట్టిన భూమి పత్రాలను పరిశీలించారు. వాళ్లు ఒకవేళ రుణం చెల్లించకుంటే తనఖా పెట్టిన భూమినైనా వేలం వేసుకోవడానికి అవకాశం ఉంటుందని భావించారు. ఆ మేరకు డాక్యుమెంట్లను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకెళ్ళి పరిశీలించగా అవి నకిలీవని తేలింది. దీంతో వారు తిరుపతి క్రైం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ తతంగం జరిగి ఆరేడు నెలలయ్యాయి. ఇదే కేసులో మొదటి నిందితుడ్ని మాత్రం గత నెల 20న క్రైం పోలీసులు అరెస్టు చేసినట్లు చెబుతున్నారు. మరో ముగ్గురి వరకు పరారీలో ఉండొచ్చని అనుమానిస్తున్నారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. అదేవిధంగా, అప్పట్లో రుణం మంజూరు చేసిన మేనేజర్, అధికారుల పాత్రపైనా పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అప్పటి మేనేజరు.. ప్రస్తుతం విజయవాడలో ఉన్నట్లు సమాచారం.



అమ్మో.. ఏనుగుల గుంపు

రోడ్డుకు ఒక వైపు 16 ఏనుగుల ఘీంకారాలు. మరో వైపు వీటిని చూసేందుకు గుమిగూడిన జనం. ఇంకోవైపు రోడ్డుకు రెండువైపులా బందోబస్తు చేపడుతూ ఏనుగులను అడవి వైపు మళ్లించేందుకు అటవీశాఖ అధికారులు, పోలీసులు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు సమీపంలోని గుట్టమీదపల్లి వద్ద శుక్రవారం ఉదయం దృశ్యమిది. రెండు గంటల పాటు ఉత్కంఠ నెలకొంది. చివరకు ఏనుగుల గుంపు అడవి వైపు అడుగులు వేయడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

\- కల్లూరు

రైతులే పంట బీమా కట్టుకోవాలి

తిరుపతి (ఎంఆర్‌పల్లె), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగుచేసే పంటలకు రైతులే బీమా కట్టుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు శుక్రవారం తెలిపారు. రుణాలు తీసుకున్న రైతులు బ్యాంకు ద్వారా, తీసుకోని వారు మీసేవా కేంద్రాల్లో వేరుశనగ పంట ఎకరాకు రూ.450, వరికి రూ.630 చొప్పున బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు. సీఎస్‌సీ సెంటర్, ఎన్‌సీఐపీ వెబ్‌సైట్‌లోనూ ప్రీమియం కట్టవచ్చని తెలిపారు.

రుయాస్పత్రిలో ఫ్లెక్సీలు పెడితే చర్యలు

● అధికారులకు తేల్చిచెప్పిన కలెక్టరు
● హెచ్‌డీఎస్ సభ్యుడి తీరుపైనా ఆగ్రహం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): 'తిరుపతి రుయాస్పత్రి నో ఫ్లెక్సీ జోన్ అనేది అందరూ గుర్తుపెట్టుకోవాలి. ప్రభుత్వ పథకాల బోర్డులు తప్ప, ఇతర ఫ్లెక్సీలు, బోర్డులు పెడితే రుయా అధికారులపై చర్యలు తప్పవు' అని కలెక్టరు వెంకటేశ్వర్ హెచ్చరించినట్లు తెలిసింది. హెచ్‌డీఎస్ వర్కింగ్ చైర్మన్‌గా చెప్పుకొనే సభ్యుడు బండ్ల లక్ష్మీపతి తీరుపైనా ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. వివరాలిలా ఉన్నాయి. మరోసారి లక్ష్మీపతి హెచ్‌డీఎస్ వర్కింగ్ చైర్మన్ అని చెలామణి అయితే తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రుయాస్పత్రిలో అధికారికంగా నిర్వహించే ఈ కార్యక్రమంలోనూ అతడికి ప్రాధాన్యం ఇవ్వరాదని, శిలాఫలకాలపైనా పేరు ఉండరాదని అధికారులకు స్పష్టంచేసినట్లు తెలిసింది. ఆస్పత్రి అభివృద్ధి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సహకరిస్తారనే కమిటీలో సభ్యులుగా తీసుకుంటామని, వారే ఇలా రోగులు, వైద్యులు ఇబ్బందులకు గురయ్యేలా వ్యవహరించడం బాధాకరమని పేర్కొన్నారు. ఇతడి చర్యల వల్ల పాలకులకు, ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందనే విషయాన్ని ప్రతీ ఒక్కరూ గ్రహించాలన్నారు. ఇలాంటి అంశాలపై పాలకులు సైతం దృష్టి పెట్టి ఆస్పత్రి అభివృద్ధికి సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అధికారులతో చర్చించినట్లు తెలిసింది. మరోసారి ఇటువంటివి చోటుచేసుంటే తక్షణమే రుయా అధికారులు తన దృష్టికి తీసుకురావాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

స్విమ్స్‌లో బీఎస్సీ నర్సింగ్, పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యునివర్సిటీలో బీఎస్సీ(నర్సింగ్), బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ, బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్సెస్(పారా మెడికల్) కోర్సులకు 4వ విడత, ఫైనల్ ఆఫ్‌లైన్ విధానంతో ఈ నెల 29న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రారు అపర్ణ బిట్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు పూర్తి ఫీజుతో హాజరు కావాలని కోరారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే రిజర్వేషన్ క్యాటగిరీ ప్రకారం ఏపీఈఏపీసీఈటి ర్యాంక్ కట్ ఆఫ్‌ను అనుసరించి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్ల భర్తీ జరుగుతుందని, ఉదయం 8.30 గంటలకు శ్రీపద్మావతి మెడికల్ కళాశాలకు చేరుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

అమ్మవారికి వేడుకగా తిరువీధి ఉత్సవం

తిరుచానూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువైన శ్రీవారి దేవేరి పద్మావతి అమ్మవారికి శుక్రవారం సాయంత్రం అత్యంత వేడుకగా తిరువీధి ఉత్సవం జరిగింది. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ వేడుకగా జరిగింది. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తిని ఫ్రైడేగార్డెన్‌కు వేంచేపు చేసి అర్చకులు వేడుకగా తిరుమంజనం నిర్వహించారు. అలంకార శోభితురాలైన పద్మావతిదేవి బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకుడు బాబుస్వామి, సూపరింటెండెంట్ ప్రసన్నకుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


తిరుచ్చిపై ఊరేగుతున్న పద్మావతి అమ్మవారు

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ

● గడువు తీరిన చిక్కీల స్వాధీనం


చిక్కీలను తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

పాకాల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మద్దిలేటి నరసాపురం తనిఖీలు నిర్వహించారు. హైకోర్టు ఆదేశాలతో మంగళవారం న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. గడువు తీరిన చిక్కీలు ఉన్నట్లు గుర్తించారు. వీటిపై వార్తాపత్రికల్లో కథనాలు రావడంతో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు ఇటీవల డీఈవో తనిఖీ చేశారు. శుక్రవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పాఠశాలలో చిక్కీలను తనిఖీ చేశారు. గడువు తీరిన 10 బాక్సుల చిక్కీలను స్వాధీనం చేసుకున్నారు. ఎంఈవో-2 లింగయ్య, హెచ్‌ఎం మహమ్మద్ రఫీల వివరణ తీసుకున్నారు. గడువు తీరిన చిక్కీలను పరీక్షించి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారీలో జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలకు అందించే ఆహార పదార్థాల నాణ్యతను నిత్యం పరిశీలించాలని ఆయన హెచ్‌ఎంకు సూచించారు.

వెంకటేశ్వరుడి సేవలో ప్రముఖులు



పార్లమెంటరీ అఫిషియల్ లాంగ్వేజ్ కమిటీ - నందమూరి రామకృష్ణ

తిరుమల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ముందుగా కమిటీ అఫ్ పార్లమెంట్ ఆన్ అఫిషియల్ లాంగ్వేజ్ డిప్యూటీ చైర్మన్ భర్తృహరి మహతాబ్, కన్వీనర్ శ్రీరంగ్ అప్ప ఆధ్వర్యంలో సభ్యులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యేలు గౌతు శిరీష, మురళీమోహన్, సినీ సంగీత దర్శకుడు తమన్, గాయకులు సాకేత్, కార్తీక్, నటుడు అమరదీప్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. అంతకుముందు అభిషేకసేవలో నందమూరి రామకృష్ణ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తిరుమలకు వద్దామని ఎప్పటి నుంచో అనుకుంటున్నానని, కొన్ని కారణాలతో రాలేకపోయినట్టు తెలిపారు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత కాలినడకన తిరుమలకు వస్తానని మొక్కుకుని ఇప్పుడు తీర్చుకున్నట్టు తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.48 కోట్లు

తిరుమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.48 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. గురువారం 61,004 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 20,173 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలలో ఈవో తనిఖీలు

తిరుమల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తనిఖీలు నిర్వహించారు. ముందుగా వకుళమాత కేంద్రీయ వంటశాలను పరిశీలించి తర్వాత నూతనంగా నిర్మిస్తున్న పీఏసీ5ను తనిఖీ చేశారు. అక్కడ పనుల పురోగతి గురించి ఇంజినీరింగ్ అధికారులతో ఆరా తీశారు. అనంతరం కౌస్తుభం, సప్తగిరి, ఎస్ఎంపీ, షాపింగ్ కాంప్లెక్స్ వద్ద హోటళ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం శిలాతోరణం వద్దకు చేరుకుని తనిఖీ చేశారు. ఔటర్ రింగ్ రోడ్డులో భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న నూతన క్యూలైన్లు, మరుగుదొడ్లు, ఫుడ్ కోర్టులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, ఈఈలు వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం, డీఈ చంద్రశేఖర్, ఎస్టేట్స్ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆధార్ సేవా శిబిరాలు



తిరుపతిరూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలో ఈనెల 22నుంచి 25వ తేదీ వరకు నాలుగు రోజులపాటు నిర్వహించిన ఆధార్ నమోదు, బయోమెట్రిక్ ప్రామాణీకరణ సేవా శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. మండలంలోని 37 సచివాలయాల్లో 864 ఆధార్ సేవలను ప్రజలు వినియోగించుకున్నారని ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే నాని మండల పర్యటన

ఎర్రావారిపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం మండలంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా భక్తులకు చేసిన ఏర్పాట్లను ఉదయం 8గంటలకు పరిశీలిస్తారు. 10 గంటలకు నెరబైలులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎర్రావారిపాలెంలో జరిగే మండల సర్వ సభ్య సమావేశానికి హాజరు కానున్నారు.

సీఎం సహాయనిధికి రూ.5లక్షల విరాళం


ఎమ్మెల్యే నానికి విరాళం చెక్కును అందజేస్తున్న ఎడిఫై విద్యార్థులు

తిరుచానూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధికి ఎడిఫై విద్యార్థులు రూ.5లక్షల చెక్కును ఎమ్మెల్యే పులివర్తి నానికి శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న సాటివారిని ఆదుకుందామన్న సీఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపుకు స్పందించిన ఎడిఫై విద్యార్థులు కూడా విరాళాలు అందజేయడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఎడిఫై విద్యాసంస్థల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం


సమావేశమైన సమరసతా సేవ ఫౌండేషన్ సభ్యులు

రామచంద్రాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని కాపాడటానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సమరసతా సేవ ఫౌండేషన్ ప్రాంతీయ పరియోజన ప్రముఖులు చావా రాంబాబు అన్నారు. రామచంద్రాపురం మండలం తిమ్మరాజుపల్లిలో సమరసతా సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ కన్వీనర్లు, అభ్యాసపరులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.ఇతర ధర్మాల నుంచి హిందూ ధర్మంలోకి వచ్చిన వారికి సముచిత స్థానం ఇస్తామన్నారు. కార్యక్రమంలో ధనంజయ, శ్రీనివాసరెడ్డి, మునికృష్ణమనాయుడు, మామిడి లీలాకృష్ణ, చంద్రగిరి, రామచంద్రాపురం, వడమాలపేట మండలాల నుంచి 50మంది గ్రామ కన్వీనర్లు, మండల కమిటీ సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రీసర్వే భూసమస్యలకు సత్వర పరిష్కారం

తిరుపతిరూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రీసర్వే భూములకు సంబంధించిన సమస్యలపై అర్జీదారులకు సత్వర పరిష్కారం అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తిరుపతి రూరల్ మండల తహసీల్దార్ రామాంజులు నాయక్ తెలిపారు. మండలంలోని తనపల్లె పంచాయతీ కార్యాలయంలో రీసర్వేలో వచ్చిన భూసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రీసర్వే సమస్యలపై తమ కార్యాలయానికి అర్జీ అందిన 15రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. రైతులు అడిగిన సందేహాలపై అధికారులు అవగాహన కల్పించారు. సర్వే విభాగ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, ఇన్‌స్పెక్టర్లు రామ్‌ప్రసాద్, కృపాకర్, రూరల్ మండల ఆర్ఎస్‌డీటీ మోహన్, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, వీఆర్వో వలర్మతి, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు బాలచంద్రారెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, చెంచురెడ్డి పాల్గొన్నారు.

తలకోన హుండీ ఆదాయం రూ.6.84 లక్షలు

ఎర్రావారిపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో నాలుగు నెలల హుండీ ఆదాయం రూ.6,84,476 వచ్చినట్లు కార్యనిర్వాహణాధికారి మమత తెలిపారు. అన్నదానం హుండీ ద్వారా 120 రోజులకు సంబంధించి రూ.74,353 ఆదాయం వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ మదనపల్లె డివిజన్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలువ పొరంబోకు ఆక్రమణకు యత్నం

● పట్టించుకోని రెవెన్యూ అధికారులు


కాలువ పొరంబోకుని చదును చేసి బోరు వేసిన దృశ్యం

తిరుపతి రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామ లెక్కదాఖలలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సర్వేనెంబరు 242లోని కాలువ పొరంబోకు భూమి ఆక్రమణకు కొంతమంది ప్రయత్నించారు. ఈభూమిని ఎక్సకవేటర్‌తో చదును చేయడంతోపాటు దానిలో బోరు కూడా వేశారు. జాతీయ రహదారికి అత్యంత సమీపంలో ఉండడంతో దీనిపై కన్నేసిన కొంద మంది ఈభూమి ఆక్రమణకు ప్రయత్నించారు. స్థానిక రెవెన్యూ అధికారులకు ఈ విషయం తెలిసికూడా తెలియనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విలువైన ఈభూమిని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

అమ్మవారి సేవలో కేంద్రమంత్రి


ఆలయం వద్ద రామ్మోహన్ నాయుడు

తిరుచానూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని శుక్రవారం కేంద్ర పౌరవిమానాయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్ ప్రసన్నకుమార్, అర్చకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. మొదట ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించి, తరువాత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆయనకు వేదపండితులు వేదాశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

పల్లెల్లో పండుగ వాతావరణం కల్పించాలి

- ఎమ్మెల్యే పులివర్తి నాని


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పండుగ వాతావరణం కల్పించాలని, ప్రతి అధికారి బాధ్యతగా పనిచేస్తే వారికి అండగా ఉంటానని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శుక్రవారం చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పంచాయతీ కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాల్లో వెంటనే విద్యుత్, పారిశుధ్యం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. దీపావళి పండుగకు ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేయనున్న నేపథ్యంలో అర్హులను గుర్తించి, కేవైసీ చేయించాలని చెప్పారు. వీఆర్వోలు గ్రామాల్లో కబ్జాలకు తావులేకుండా చూడాలన్నారు. తొండవాడ జగనన్న కాలనీలను రెవెన్యూ అధికారులు సందర్శించి క్షేత్రస్థాయిలో ఉన్న లబ్ధిదారులను గుర్తించి, బినామీలకు ఇచ్చిన ఇంటి పట్టాలు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో శేఖర్, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు కుమారరాజారెడ్డి, రమేష్‌రెడ్డి, గౌస్‌బాషా, దుబాసి రామ్మూర్తి, అన్నిశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంక్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తిచేయండి


టీటీడీ అధికారులతో మాట్లాడుతున్న జేఈవో గౌతమి

తిరుమల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదీన నిర్వహించనున్న టీటీడీ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ (టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంక్) ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తిచేయాలని టీటీడీ జేఈవో గౌతమి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని ఏడీ బిల్డింగ్‌లో శుక్రవారం ఆమె అధికారులతో సమీక్షించారు. జేఈవో మాట్లాడుతూ.. తిరుమలలోని ఎస్వీ హైస్కూల్, తిరుపతిలోని ఎస్‌జీఎస్ హైస్కూల్‌లో ఎన్నికల కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తిరుమలలో పనిచేసే ఉద్యోగులు ఎస్వీ హైస్కూల్‌లో, తిరుపతి, ఇతర ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులు ఎస్‌జీఎస్ హైస్కూల్‌లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి తమ ఒరిజినల్ ఐడీ కార్డుతో వచ్చి ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. సెల్‌ఫోన్ అనుమతి లేదన్నారు. విద్యుత్, టీటీడీ విజిలెన్స్, ఐటీ, ఇంజినీరింగ్, సెక్యూరిటీ విభాగాల అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి లక్ష్మి, ఎన్నికల అధికారి ఉమాపతి, ఝాన్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ చేసిన పూర్వ విద్యార్థులు



పాకాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పాకాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ (పోస) ప్రతినిధులు విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 29 మంది పేద విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం పంపిణీ చేశారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, పోస అధ్యక్షుడు వై.లింగయ్య నాయుడు, కోశాధికారి జీవీ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిత్ర లేఖనం పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థినికి బహుమతి


నేహశ్రీకి పారితోషికాన్ని అందిస్తున్న అధికారులు

ఎర్రావారిపాలెం, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి): ఆడ శిశువును కాపాడుదాం-సృష్టిని రక్షిద్దాం అనే అంశంపై జిల్లా స్థాయిలో జరిగిన చిత్ర లేఖనం పోటీల్లో ఎర్రావారిపాలెం మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని నేహశ్రీ ద్వితీయస్థానం సాధించింది. తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రెండో స్థానం పొందిన నేహశ్రీకి రూ.3 వేలు నగదు పారితోషికం అందించినట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు.

పండ్ల పరిశ్రమల సమస్యలను పరిష్కరించండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పండ్ల పరిశ్రమల యజమానులు

తిరుపతి(కలెక్టరేట్) అక్టోబరు 25: పండ్ల పరిశ్రమలకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని, రాబోయే సీజన్‌లో మామిడి రైతులకు గిట్టుబాటు .ధర కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పండ్ల పరిశ్రమల యజమానులు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఉమ్మడి చిత్తూరు జిల్లా పండ్ల పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ త్వరలో సమావేశం నిర్వహించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ దశరథరామిరెడ్డి, పండ్ల పరిశ్రమల సమాఖ్య అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి కట్టమంచి బాబి, సభ్యులు విద్యాసాగర్, ఉమాపతి, నందగోపాల్, లోకాద్రి, గాంధీ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహనా ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న వీసీ ఉమ, చిత్రంలో రిజిస్ట్రార్ రజని తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీలో క్యాన్సర్‌పై అవగాహనా ర్యాలీ చేపట్టారు. వీసీ ప్రొఫెసర్ ఉమ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. పరీక్షలు చేసుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతను గుర్తించి నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. టాటా క్యాన్సర్ హాస్పిటల్ అంకాలజీ డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ మహిళలు రొమ్ము క్యాన్సర్‌ను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ముందస్తుగా గుర్తించి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. అంకాలజిస్టులు అనూష, నాగేశ్వరరెడ్డి, ప్లాస్టిక్ సర్జన్ బాబురావు మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, ఇన్‌చార్జి డీన్ మధుజ్యోతి పాల్గొన్నారు.

శ్రీనివాసమంగాపురం ఆలయంలో 28 నుంచి పవిత్రోత్సవాలు

- రేపు అంకురార్పణ

చంద్రగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేయనున్నారు. పవిత్రోత్సవాలలో 28న యాగశాల వైదిక కార్యక్రమాలు, సాయంత్రం 6.30 గంటలకు పవిత్ర ప్రతిష్ఠ, 29న మధ్యాహ్నం 12 గంటలకు పవిత్ర సమర్పణ చేస్తారు. 30న రాత్రి 7 గంటలకు పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. 28 నుంచి 30వ తేదీ వరకు ఆర్జిత సేవలు రద్దయ్యాయి. గృహస్థులు(ఇద్దరు) రూ.516 రూపాయలు చెల్లించి పవిత్రోత్సవాల ఆర్జిత సేవలో పాల్గొనవచ్చు. భక్తులు పవిత్రోత్సవాలలో పాల్గొని స్వామి అమ్మవార్లకు పాత్రులు కాగలరని టీటీడీ కోరింది.

పశుగణనను సమగ్రంగా నిర్వహించండి

భాకరాపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పశుగణనను సమగ్రంగా నిర్వహించాలని చిన్నగొట్టిగల్లు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమణకుమార్ తెలిపారు. అఖిల భారత పశుగణన కార్యక్రమంలో భాగంగా చిన్నగొట్టిగల్లులో శుక్రవారం ఆయన పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పశుగణన భవిష్యత్తు ప్రణాళిక రూపకల్పనకు కీలకమైన సమాచారాన్ని అందిస్తుందన్నారు. ప్రతి ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించి సమగ్ర సమాచారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ విజయ కుమారి, టీడీపీ నేత మోహన్ రెడ్డి, పశువైద్యాధికారి స్రవంతి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశాఖలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

తిరుపతి(వైద్యం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వాటిని పరిష్కరించి అరియర్స్‌ను సకాలంలో చెల్లించాలని ఏపీ హంస నేతలు చీఫ్ సెక్రటరీ కృష్ణబాబును కోరారు. తిరుపతిలోని ఓ హోటల్లో ఆయన్ను శుక్రవారం ఏపీ హంస ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజా ఆధ్వర్యంలో ఉద్యోగులు కలిసి సమస్యలను వివరించారు. సీనియర్ హెల్త్ అసిస్టెంట్లకు 29 ఏళ్లుగా పదోన్నతులు లేవని తెలిపారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని కోరారు. తిరుపతి, కడపలో చీఫ్ రేడియోగ్రాఫర్స్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ఏపీ హంస కార్యదర్శి టాటాబాయి, కోశాధికారి ఇమ్రాన్, ప్రచార కార్యదర్శి భాస్కర్, ఉమెన్ సెక్రటరీ రోహిణి, తిరుపతి తాలూకా అధ్యక్షుడు రాజేష్, సెక్రటరీ సురేంద్ర, నేతలు సునీల్, పద్మజ, జ్యోతి పాల్గొన్నారు.


కృష్ణబాబుకు ఉద్యోగుల సమస్యలను వివరిస్తున్న ఏపీ హంస నేతలు

మురుగు నీరు తొలగింపు



తిరుపతి అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కరకంబాడి రోడ్డు వినాయకసాగర్‌కు పశ్చిమాన మాస్టర్‌ప్లాన్ రోడ్డు చివర్లో కొన్ని నెలలుగా నిల్వ ఉంటున్న మురుగునీటిని శుక్రవారం తొలగించారు. దీనిపై గతంలో ఆంధ్రజ్యోతిలో పలుమార్లు వార్తలు ప్రచురితమయ్యాయి. దీనిపై ఎమ్మెల్యే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆరణి శ్రీనివాసులు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు జేసీబీతో కాలువ తీసి సమీపంలోని డ్రైనేజీలోకి నీటిని మళ్లించారు. ఇకపై నీరు నిల్వ ఉండకుండా సిమెంట్ పైపులు ఏర్పాటు చేశారు. జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి ఈ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో హేమంత్, వంశీ, బాలాజీ, పురుషోత్తం పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు



తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాస్ మారుతీనగర్ క్లస్టర్ పరిధిలోని యానాది కాలనీలో టాటా క్యాన్సర్ ఆస్పత్రి వైద్య బృందం శుక్రవారం మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి లావణ్య వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మహిళలకు రాస్ చేస్తున్న సేవలను కొనియాడారు. క్యాంప్ కో-ఆర్డినేటర్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం, కల్తీ ఆహారం, సకాలంలో భోజనం చేయకపోవడం వల్ల క్యాన్సర్ సోకే ప్రమాదముందని, ముందుగా గుర్తిస్తే నివారించవచ్చునని తెలిపారు. 50 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. రాస్ సిబ్బంది నాగేశ్వర్, బాలాజీ, జ్యోతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు త్వరలో పూర్వ వైభవం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ త్వరలోనే పూర్వ వైభవం సంతరించుకుంటుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకర్‌రెడ్డి జోస్యం చెప్పారు. స్థానిక యూత్ హాస్టల్లో శుక్రవారం పార్టీ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ నేతలు ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేయాలని కోరారు. చిట్టిబాబు మాట్లాడుతూ నవంబర్ 7వ తేదీన విజయవాడలో జరిగే సమావేశంలో పార్టీ పటిష్ఠత, భవిష్యత్తు కార్యాచరణపై పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

సమావేశంలో తిరుపతి జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు బాల గురవం బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంభూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపాల్ రెడ్డి, బీసీ సెల్ కోఆర్డినేటర్ కంభంపాటి మురళీకృష్ణ, మాజీ అధ్యక్షుడు గోపి గౌడ్, ఎస్సీ సెల్ తిరుపతి మాజీ అధ్యక్షుడు చిత్తూరు శివశంకర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి లోకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై 28 నుంచి ఎస్ఎఫ్ఐ నిరసనలు

తిరుపతి(విద్య), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఈనెల 28 నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, కార్యదర్శి రవి వెల్లడించారు. ఎస్ఎఫ్ఐ జిల్లాకమిటీసమావేశం వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు.వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగంలో చెల్లించకుండా ఉంచిన రూ.3,500 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి 4 నెలలైనా బకాయిలు చెల్లించకపోవడంతో కొన్ని కళాశాలలు విద్యార్థులను పరీక్షలు రాయనీయడంలేదన్నారు. జీవో 77ను రద్దుచేసి విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వాలని కోరారు. ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మళ్లీ ప్రారంభించాలన్నారు. ఎస్ఎఫ్ఐ సభ్యులు వినోద్, అశోక్, తేజ, నరేంద్ర, గురవయ్య, శ్రీనివాస్, రవీంద్ర, గణేష్, డేవిడ్, చరణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : శ్రీనివాసం 33-11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో లైన్ల మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని తిరుపతి పట్టణ ఈఈ వి.చంద్రశేఖర్‌రావు తెలిపారు. రవీంద్రనగర్, కొర్లగుంట, మారుతీనగర్, సంజయ్‌గాంధీకాలనీ, డీబీఆర్ రోడ్డు, చింతలచేను, గురవారెడ్డి సమాధిప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన ర్యాగింగ్ వ్యతిరేక అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారి భవిష్యత్తు నాశనమవుతుందని తెలిపారు. విద్యార్థులందరూ స్నేహపూర్వకంగా మెలగాలని, తోటివారి పట్ల వికృత చేష్టలు, మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించడం తగదని అన్నారు. డ్రగ్స్, సైబర్ క్రైం వంటి వాటి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్, మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. ర్యాగింగ్‌కు ఎవరైనా పాల్పడితే పోలీసు హెల్ప్ లైన్. 1800 - 180 - 5522లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ యూనివర్సిటీలో ర్యాగింగ్ నిరోధానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ సీడీసీ డీన్ ప్రొఫెసర్ చెంగ్రాయుడు, స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ టీవీ మురళీధర్, కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

ప్రసూతి మరణాల నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్) అక్టోబరు 25: ఆస్పత్రుల్లో ప్రసూతి మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ప్రసూతి మరణాలపై కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ చిన్న పొరబాటుకు తావులేకుండా ప్రసవ సమయంలో నియమావళి మేరకు వైద్య పరీక్షలు జరిపి తల్లీబిడ్డ క్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మాతృ మరణాలపై కుటుంబ సభ్యుల వివరణ పరిగణనలోకి తీసుకుని, నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గూడూరులోని సీఆర్‌రెడ్డి ఆస్పత్రిలో ఎక్కువగా సిజేరియన్‌లు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గూడూరులోని అన్వేష్ ఆస్పత్రిలో జరిగిన మాతృ మరణంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారిణి జయలక్ష్మి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి శాంతకుమారి, అదనపు డీఎంహెచ్‌వో శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు పాల్గొన్నారు.

రేపు ఆఫీసర్స్ క్లబ్ ఎన్నికలు

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలోని ఆఫీసర్స్ క్లబ్ ఎన్నికలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు క్లబ్ కార్యదర్శి ఆర్.ఎర్రంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల మధ్య పోలింగ్ జరుగుతుందని, సభ్యులు ఓటు హక్కును వినియోగించుకోవాలనికోరారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం క్లబ్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని తెలిపారు.

అలరించిన గజేంద్రమోక్షం హరికథ



తిరుపతి (కల్చరల్), అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వర సంగీత నృత్య కళాశాలలో శుక్రవారం జరిగిన గజేంద్రమోక్షం హరికథా ప్రదర్శన ఆహూతులను అలరించింది. ఆచార్య ప్రతిభ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం కళాశాల ఆవరణలో తెలుగు అధ్యాపకుడు, హరికథా సుధానిధి డాక్టర్ వై.వేంకటేశ్వర్లు భాగవతార్ గజేంద్రమోక్షం కథాగానం చేశారు. ఎస్.మురళి (వయోలిన్), జి.రెడ్డి శేఖర్ (తబలా), జయచంద్ర (రిథమ్ ప్యాడ్)పై వాద్య సహకారం అందించారు. అనంతరం కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మృదంగం విభాగం ఆచార్యులు మారుతి రఘురామ్‌లు కళాకారులను సత్కరించారు. సంగీత కళాశాల అధ్యాపకులు శ్రీవాణి, కృష్ణ పాల్గొన్నారు.

లక్ష దాటిన బీజేపీ సభ్యత్వం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి



తిరుపతి (ఉపాధ్యాయనగర్), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సాధారణ సభ్యత్వం జిల్లాలో లక్ష దాటిందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ చెప్పారు. సభ్యత్వ నమోదుపై సమీక్ష సమావేశం రాఘవేంద్రనగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 10 కోట్లకు పైగా సభ్యత్వంతో బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. ఈ నెలాఖరు లోపు 30వేల సభ్యత్వాన్ని పూర్తిచేసి, ప్రతి మండలంలో కనీసం 25 మంది క్రియాశీలక సభ్యులు ఉండేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ అజయ్‌కుమార్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి, నాయకులు డాక్టర్ శ్రీహరిరావు, వరప్రసాద్, నవీన్‌కుమార్‌రెడ్డి, సుబ్బుయాదవ్, ప్రభాకర్‌నాయుడు, జీవన్‌రాయల్, గవ్వల అశోక్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెన్షన్ ప్రతిపాదనలు ఆరు నెలల ముందే పంపాలి

తిరుపతి(కలెక్టరేట్) అక్టోబరు 25: ఉద్యోగ విరమణ చేయబోయే ప్రతి ప్రభుత్వ ఉద్యోగీ వారి పెన్షన్ ప్రతిపాదనలను ఆరు నెలల ముందుగానే పంపించేలా డీడీవోలు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళి సింగ్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ నిర్వహించారు. పెన్షన్ దరఖాస్తులను సకాలంలో పూర్తి వివరాలతో పంపాలని డీడీవోలకు సూచించారు. జీపీఎఫ్ నామిని, మిస్సింగ్ క్రెడిట్స్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం కోసం ఈ అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఉద్యోగీ నామిని వివరాలను రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఉద్యోగ విరమణ పొందిన పలువురు ఉద్యోగులకు పెన్షన్, జీపీఎఫ్ మంజూరు పత్రాలను అందజేశారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి : జిల్లాలోని రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం జిల్లా సహాయ అధ్యక్షుడు గోపాల్ విన్నవించారు. తిరుపతి జిల్లా ట్రెజరీ పరిధిలోని ఫైళ్లు ఇంకా చిత్తూరులోనే ఉండడంతో వెళ్లి రావడానికి ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. పెన్షన్ అదాలత్ పేరుతో నిర్వహిస్తున్న సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయని విమర్శించారు.



రంగు రంగుల విద్యుద్దీప కాంతులతో తిరుపతిలోని గోవింద రాజస్వామి ఆలయ రాజగోపురం శుక్రవారం రాత్రి మెరిసిపోయింది. దీపావళి వేడుకల్లో భాగంగా ఆలయంలో ఈనెల 30, 31 తేదీల్లో విశేష పూజలు, దీపావళి ఆస్థానం నిర్వహించనున్నారు.
ఈ నేపథ్యంలో విద్యుద్దీపాలతో ఆలయాన్ని, గోపురాలను టీటీడీ అలంకరించింది. ఠీవిగా నింగిలోకి చూస్తున్నట్లుగా ఉండే ఈ గోపురం.. రంగురంగుల కాంతులతో మెరిసిపోతూ నగరవాసులను, యాత్రికులను ఆకట్టుకుంటోంది.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

చల్లని గాలులు.. ప్రకృతి సోయగాల నడుమ పచ్చటి పొలాల్లో పక్షులు కిలకిలరావాలతో సందడి చేస్తున్నాయి. తీర ప్రాంత గ్రామమైన దామరాయి వద్ద వరిపైరుకు నష్టం కలిగించే కీటకాలను తింటూ.. చక్కర్లు కొడుతున్నాయి. ఈ సీజనైతే చాలు.. రైతన్నలకు నేస్తాలుగా ఈ పక్షులు పంట పొలాలపై ఎగురుతూ, అటు వెళ్లేవారికి కనువిందు చేస్తుంటాయి.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి




ఆనంద నిలయం కథ

ప్రత్యేక కథనం తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమల అనగానే వెలుగులీనే బంగారు గోపురం గుర్తొస్తుంది. దీనిని 'ఆనంద నిలయ విమానం' అంటారు. బంగారు తాపడపు కవచాలలో ఒదిగిన ఈ గోపురాన్ని ఎప్పుడు నిర్మించారనే ఆధారాల్లో స్పష్టత లేదు కానీ, బంగారు తాపడపు పనులు ఎప్పుడెప్పుడు జరిగాయో శాసన లిఖితమై ఉంది. 12, 13 శతాబ్దాల కాలంలో తిరుమల ఆలయ నిర్మాణ సమయంలో ఈ గోపురానికి 'విమానం' అనే మాట తొలిసారి వినిపించింది అంటారు. ఈ మూడంతస్తుల గోపురంలో దిగువన ఉండే రెండంతస్తులు దీర్ఘచతురస్రాకారంలో ఉంటాయి. చివరి అంతస్థు వర్తులాకారంగా ఉంటుంది. వేసర శైలిలో నిర్మించిన ఈ గోపురం మీద అసంఖ్యాక శిల్పాలుంటాయి. తొలి అంతస్తులో మాత్రం లతలు, మకరతోరణాలు మాత్రమే ఉంటాయి. రెండో అంతస్తులో వివిధ భంగిమల్లో 40 శిల్పాలుంటాయి. ఈ అంతస్తులోనే వాయవ్యంలో విమాన వేంకటేశ్వరుడి ప్రతిమ ఉంటుంది. మూడో అంతస్తులో మహాపద్మంతో పాటు 20 ప్రతిమలు ఉంటాయి. నాలుగు మూలల్లో 8 సింహాలుంటాయి. చిలకలు, లతలు, హంసలతో ఈ వర్తులాకారపు శిఖరగోపురం ఆకర్షణీయంగా ఉంటుంది.

భూతలం నుంచి బంగారు కలశం దాకా ఆనందనిలయ విమానం ఎత్తు 65 అడుగుల 2 అంగుళాలు.





హైదరాబాదు మ్యూజియంలో ఉన్న తిరుమల ఆలయ సముదాయాల పాతచిత్రం

ఆనందనిలయం బొమ్మతో 2002లో తపాలాశాఖ ప్రత్యేక స్టాంపును కూడా విడుదల చేసింది.

- క్రీ.శ.839లో పల్లవరాజు విజయదంతి విక్రమవర్మ ఆనంద నిలయ విమానానికి స్వర్ణకవచం ఏర్పరచాడు.
- క్రీ.శ.1262లో జాతవర్మ సుందరపాండ్య దేవుడు కూడా స్వర్ణ కవచాన్ని సమర్పించాడు.
- క్రీ.శ.1359 జూలై 6న సాళువ మంగిదేవ మహారాజు ఆనంద నిలయ విమానంపై వున్న పాత కలశాన్ని తీసివేసి కొత్త బంగారు కలశాన్ని ప్రతిష్ఠించాడు.
- క్రీ.శ.1417లో విజయనగర అమాత్యుడు చంద్రగిరి మల్లన ఆనంద నిలయ విమాన జీర్ణోద్ధరణ చేశాడు.
- క్రీ.శ.1518 సెప్టెంబర్ 9న విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు 30 వేల బంగారు వరహాలతో ఆనంద నిలయ విమానానికి బంగారు మలాము చేయించాడు. ఆ తర్వాత వీరనరసింగదేవ యాదవరాయలు కూడా తన ఎత్తు బంగారాన్ని తులాభారం వేసుకుని, ఆ బంగారంతో ఆనందనిలయ విమానంతో పాటు బంగారు వాకిళ్లకు కూడా బంగారు పూత పూయించాడు.
- క్రీ.శ.1630లో కంచికి చెందిన కోటి కన్యాదానం తాతాచార్యులు ఆనందనిలయ విమానానికి బంగారు మలాము చేయించాడు.
- క్రీ.శ.1908 సెప్టెంబర్ 30న మహంతు ప్రయాగదాసుకు సోదర శిష్యుడైన అధికారి రామలక్ష్మణదాసు ఆనందనిలయ విమానంపై బంగారు కలశాన్ని ప్రతిష్ఠించాడు.
- 1958 ఆగస్టు 18 నుండి 27 వరకు పదిరోజులపాటు ఆనందనిలయ విమాన మహాసంప్రోక్షణ జరిగింది. ఆనందనిలయం మరమ్మతులు జరిగాయి. చెలికాని అన్నారావు సారథ్యంలో జరిగిన ఈ పనులకు 12 వేల తులాల బంగారం వాడారు.
- 1964లో అష్టబంధన మహాసంప్రోక్షణం జరిపారు.

'అమెరికా' ప్రమాద మృతులకు కన్నీటి వీడ్కోలు





అమెరికా నుంచి వచ్చిన మృతదేహాలు (ఇన్‌సెట్లో) సాయితేజారెడ్డి, హరితారెడ్డి ఫైల్‌ఫొటో

కేవీబీపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆ రెండు కుటుంబాలు తమ పిల్లల మృతదేహాల కోసం పది రోజులుగా కన్నీరు మున్నీరుగా విలపిస్తూ.. ఎదురుచూశాయి. శుక్రవారం సాయితేజారెడ్డి, హరితారెడ్డి దంపతుల మృతదేహాలు రాగానే వీరి కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. కేవీబీపురం మండలం ఆదరంలో బంధుమిత్రులు, స్థానికుల కన్నీటి వీడ్కోలు నడుమ ఆ దంపతులకు అంత్యక్రియలు జరిగాయి. ఆదరం గ్రామానికి చెందిన సాయితేజారెడ్డి.. తొట్టంబేడు మండలానికి చెందిన హరితారెడ్డికి 2022లో వివాహమైంది. వీరు అమెరికాలోని టెక్సాస్‌లో స్థిరపడ్డారు. స్నేహితులతో కలిసి విహార యాత్రకు వెళ్లి వస్తుండగా.. ఈ నెల 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో హరితారెడ్డి, మరో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా.. సాయితేజారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 15న అసువులు బాసిన విషయం తెలిసిందే. సాయితేజారెడ్డి, హరితారెడ్డి మృతదేహాలను శుక్రవారం స్వగ్రామమైన ఆదరానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విషాదం నెలకొంది.



రోదిస్తున్న సాయితేజారెడ్డి తల్లి



హరితారెడ్డి తల్లి

ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలి



ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలగాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. తిరుపతి మహిళా వర్సిటీ సావేరి అతిథి గృహంలో శుక్రవారం అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, తిరుపతి, తిరుమల, చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి సబ్ డివిజన్ల డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫిర్యాదులపై నాణ్యమైన దర్యాప్తు జరిపి, బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉంటుందన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. గంజాయి మూలాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. విక్రేతలు, వినియోగదారులు, సూత్రధారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీపావళి, కార్తీక మాసోత్సవాలు రానుండడంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీఐలు, ఎస్‌ఐలు గ్రామాల్లో పర్యటించి సైబర్ నేరాలు, 1930పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, నాగభూషణరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంజాయి కేసులో బీటెక్ విద్యార్థి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న బీటెక్ విద్యార్థిని శుక్రవారం తిరుపతి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.... రూరల్ మండలం పేరూరు శ్మశాన వాటిక వద్ద ముగ్గురు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్లు రూరల్ పోలీసులకు సమాచారం అందింది. సీఐ చిన్నగోవిందు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. పోలీసులను చూసి ఆ ముగ్గురు పారిపోవడానికి ప్రయత్నించారు. పేరూరుకు చెందిన బీటెక్ విద్యార్థి బండారి చిరంజీవిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 230 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. మిగిలిన ఇద్దరు పరారయ్యారని సీఐ చెప్పారు.

కాంట్రాక్టర్ల డిష్యుం...డిష్యుం

- తిరుపతి కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో ఘటన
- 'టెండరు సిండికేట్' వ్యవహారమే కారణమా?

తిరుపతి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఓ కాంట్రాక్టర్‌పై మరో కాంట్రాక్టరు దాడికి పాల్పడ్డాడు. టెండర్ సిండికేట్ వ్యవహారంలో మొదలైన గొడవ దాడికి దారితీసినట్టుగా తెలుస్తోంది. తాను ఆన్‌లైన్ టెండర్లో పాల్గొన్నందుకు సహచర కాంట్రాక్టర్ చంద్ర తనపై దాడి చేశారంటూ కమిషనర్ ఎన్.మౌర్యకు కాంట్రాక్టర్ ఎ.వి.చలపతి రెడ్డి ఫిర్యాదు చేశారు. ఎస్పీకి ఫిర్యాదు చేయాలని దీనిపై కమిషనర్ స్పందించినట్టు తెలిసింది. దాడివెనుకగల పూర్వాపరాలను పరిశీలిస్తే.. కార్పొరేషన్ పరిధిలో 44 అభివృద్ధి పనులకు గాను గత నెల 30న ఆన్‌లైన్ టెండర్లను పిలిచారు. ఈనేపథ్యంలో పలువురు కాంట్రాక్టర్లు వివిధ పనులకు ఆన్‌లైన్లో టెండర్లు దాఖలు చేశారు. ఇటీవల ఓ అధికార పార్టీ నాయకుడు కాంట్రాక్టర్లను పిలిచి సమావేశం ఏర్పాటుచేసినట్టు తెలిసింది. పనులన్నీ ఒకరికే కాకుండా అందరూ సమానంగా తీసుకుని 'సిండికేట్' సిద్ధాంతాలను పాటించాలని హితవు పలికినట్టు తెలిసింది. తన లాభాపేక్ష లేకుండా చెప్పిన మాటలకు కాంట్రాక్టర్లు కూడా రింగ్‌గా మారేందుకు దాదాపుగా అందరూ అంగీకరించినట్టు సమాచారం. అప్పటికే దాఖలైన టెండర్లను ఈనెల 17న తెరవాల్సి ఉన్నప్పటికీ వాయిదా వేసుకుంటూ వచ్చారు. కాంట్రాక్టర్లలో కొందరు లీడ్ తీసుకుని 44 పనులకు ఎవరెవరు టెండర్లు వేశారో పేర్లు తెలుసుకుని వాళ్లను బిడ్డింగ్ నుంచి తప్పించే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం టెక్నికల్ బిడ్ ఓపెన్ చేస్తారన్న సమాచారంతో పలువురు కాంట్రాక్టర్లు కార్యాలయానికి చేరుకున్నారు. ఇదివరకే దాఖలైన టెండర్లపై సిండికేట్ అయ్యేందుకు చలపతి రెడ్డి అంగీకరించకపోవడంతో అతడిపై దాడికి దిగినట్టుగా తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో కార్పొరేషన్ కార్యాలయంలో తీవ్ర చర్చకు దారితీసింది. కాంట్రాక్టర్లు రోడ్డున పడడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. సాయంత్రం పలు ఆన్‌లైన్ టెండర్లను తెరుస్తున్నట్టు సమాచారం. అయితే అన్ని పనులకు దాఖలైన టెండర్లను తెరవకుండా కొన్నింటినే ఓపెన్ చేయడంపై పలువురు కాంట్రాక్టర్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పశుగణన ప్రారంభం



తిరుపతి రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాకు సంబంధించి పశుగణన సర్వేని శుక్రవారం తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీ పాపిరెడ్డిపల్లెలో కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి పశుసంవర్ధకశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ ప్రారంభించారు. 2025 ఫిబ్రవరి 28వరకు జరిగే ఈ సర్వేలో 16 రకాల జంతువులను గణన చేయనున్నట్లు నాయక్ చెప్పారు. సర్వేకి వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు పూర్తి సమాచారం అందించాలని కోరారు. అందించి సహకరించాలని కోరారు. ప్రతి ఇంటికి సంబంధించి పశువులు, గొర్రెలు, మేకలు, ఫౌల్ట్రీ తదితర వివరాలను ఎన్యుమరేటర్ సేకరించాక, ఆ ఇంటి గోడపై స్టిక్కర్ మార్కింగ్ చేస్తారని కలెక్టర్ తెలిపారు. వీధిలో తిరిగే పశువులు, కుక్కల వివరాలూ సేకరిస్తారని చెప్పారు. అనంతరం ఎన్యుమరేషన్ కరదీపిక, స్టిక్కర్లు, ఐడీకార్డులు, పోస్టర్, కరపత్రాల కిట్‌ని ఆవిష్కరించారు. వెటర్నరీ వర్సిటీ రిజిస్ట్రార్ రవికుమార్, పశుసంవర్ధక జిల్లా అధికారి రవికుమార్, ఏడీ డాక్టర్ శ్రీకాంత్‌కుమార్, వెటర్నరీఅసిస్టెంట్ సర్జన్లు డాక్టర్ యోగానంద్, డాక్టర్ రెడ్డెప్పరెడ్డి, డాక్టర్ శ్రీహరిత, డాక్టర్ శైలజ, రైతులు పాల్గొన్నారు.



మృతి చెందిన వెంకటేశ్వర్లు

రోడ్డు ప్రమాదంలో పండ్ల వాపారి మృతి

వెంకటగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలకేంద్రం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ సుబ్బారావు కథనం మేరకు.. తోపుడు బండిపై పండ్ల వాపారం చేసుకొనే సాతికాలనీకి చెందిన మావిళ్ల వెంకటేశ్వర్లు క్రాస్ రోడ్డు వైపు వెళ్లేందుకు రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద ఆటో కోసం నిలుచొని ఉండగా ద్విచక్రవాహనం రాంగ్ రూట్ వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ వెంకటేశ్వర్లును స్థానికులు ఆటోలో ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడు మురళిని అదుపులోకి తీసుకొన్నారు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు ఢీకొని ప్రయాణికుడి మృతి

తడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వరదయ్యపాలెం గ్రామానికి చెందిన ప్రభాకర్(45) శుక్రవారం సాయంత్రం సమయంలో సూళ్లూరుపేటకు వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు లోకల్ ట్రైన్‌లో తడకు వచ్చాడు. రైలు దిగి స్టేషన్ వెలుపలకు వెళ్లే క్రమంలో పట్టాలు దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ ఢీకొంది ఈ ప్రమాదంలో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతిని గంజాయివనంలా మార్చారు

- జగన్‌పై ఓవీ రమణ విమర్శ

తిరుపతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతిలో జగన్ రెడ్డి బంధువు, వైసీపీ నాయకుడు గంజాయికి వేసిన మూలాలు ఇప్పటికీ వెంటాడుతున్నాయి. తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తిలో గంజాయి వల్ల ఎందరో పిల్లలు బలైపోతున్నారు. తిరుపతిని గంజాయివనంలా జగన్ మార్చారు' అంటూ టీటీడీ మాజీ సభ్యుడు ఓవీ రమణ ధ్వజమెత్తారు. తిరుపతిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమల కొండకు కూడా గంజాయి తీసుకెళ్లిన ఘనత వైసీపీదేనని ఆరోపించారు. జగన్ ఇంటి బాగోతాన్ని ఆయనే బయట పెట్టుకున్నారని, తల్లిని, చెల్లిని రోడ్డున పడేశారని విమర్శించారు.



శారదామఠం అక్రమ కట్టడాలపై తక్షణమే చర్యలు చేపట్టాలి: జనసేన

తిరుమల, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శారదా మఠంలో అక్రమ కట్టడాలపై టీటీడీ ఈవో, అదనపు ఈవో తక్షణమే చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నేత కిరణ్‌రాయల్ కోరారు. తిరుమలలోని శారదామఠం వద్ద శుక్రవారం ఆయన నేతలతో కలిసి శ్రీవారి చిత్రపటాన్ని ఉంచి, కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ అక్రమ కట్టడాలను తొలగించాలని గతంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్వామి అనుగ్రహంతో శారదాపీఠం వీటిని కూల్చివేయాలని జీవో వచ్చిందన్నారు. భక్తుల సేవ చేస్తామని తిరుమలలో మఠాలు తీసుకుని స్టార్‌హోటళ్ల తరహాలో భక్తుల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. దొంగ రాజకీయనాయకులందరికీ స్వరూపనందేంద్ర బాస్ అని విమర్శించారు. ప్రభుత్వ ఆదేశాలను టీటీడీ అధికారులు పాటించి వెంటనే అక్రమ కట్టడాలను తొలగించాలని కోరారు.



ద్విచక్ర వాహనం బోల్తాపడి యువకుడి దుర్మరణం

కోట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడు వద్ద శుక్రవారం అర్ధరాత్రి మోటార్ బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో గణేష్ (18) మృతి చెందాడు. మండలంలోని విద్యానగర్ చెందిన గణేష్ స్థానికంగా వాటర్ సర్వీస్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. పని ముగించుకొని బైక్‌లో గూడూరుకు వెళుతుండగా చిట్టేడు వద్ద బైక్ అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఎస్‌ఐ పవన్‌కుమార్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



పుత్తూరు వార్తలు

పార్కింగ్ ప్లేస్ కాదు.. పాఠశాల సుమీ..!



పుత్తూరు టౌన్, అక్టోబర్ 25(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో ద్విచక్ర వాహనదారులు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయడంతో పాఠశాల విద్యార్థులు నానావస్థలు పడుతున్నారు. పుత్తూరులోని తిరుపతి రోడ్డులో గల ఎంపీపీ మెయిన్ స్కూల్‌లో పట్టణంలోని వాహనదారులు తమ ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆటలు ఆడుకోవడానికి, మధ్యాహ్న భోజనం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానోపాధ్యాయులు పలుమార్లు వాహనదారులుకు చెప్పినా వారు పట్టించుకోవడం లేదు. పాఠశాలలో భవిత పాఠశాల, అంగన్వాడీ కేంద్రం కూడా ఉండటంతో విద్యార్థులు పడే అవస్థలు అన్నీఇన్నీ కావు.

టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 25(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రూ.100 చెల్లించి సభ్యత్వం పొందడం వలన ప్రమాద బీమా రూ.5 లక్షలు, సహజ మరణానికి రూ.10 వేలు వర్తిస్తుందని తెలిపారు.

హైకోర్టు ఉత్తర్వుల మేరకు రెవిన్యూ అధికారుల విచారణ



గ్రామంలో విచారణ చేస్తున్న రెవిన్యూ అధికారులు

పుత్తూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వుల మేరకు మండలంలోని వీఎస్ఎస్ పురంలో శుక్రవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు రైతులతో విచారణ నిర్వహిం చారు. కొన్నేళ్లుగా విద్యుత్ సదాశివపురంలోని భూములపై జమీందారీ భూములను కొనుగోలు చేసిన ఓ బ్రాహ్మణ కుటుంబానికి ప్రభుత్వం మధ్య ఎడతెగని వివాదం నడుస్తోంది. గతంలోనే బ్రాహ్మణ వంశస్తులు కోర్టు ద్వారా హక్కులను పొంది కోర్టు ధిక్కరణ కేసును వేశారు. మరో పక్క 2006లో ఆ ప్రాంతంలోని 108 మంది పట్టాదారు పుస్తకాలను పొంది తమకు హక్కులు కల్పించలేదని మరో ధిక్కరణ కేసును వేశారు. ఈ క్రమంలో పట్టాలు పొందిన లబ్ధిదారులతో రెవిన్యూ అధికారులు విచారణ జరిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దారు అశోక్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ బొబ్బిలి, లబ్ధిదారుల నాయకుడు గంగాధరం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పాలమంగళం విద్యార్థులు



నారాయణవనం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పాలమంగళం ఉన్నతపాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు మనోహరి తెలిపారు. తిరుపతిలో జరిగిన అండర్-19 కబడ్డీ పోటీలలలో 10వ తరగతి చదువుతున్న రాహుల్, పుత్తూరులో జరిగిన అండర్-14 పోటీలలో 9 వ తరగతి చదువుతున్న రాఖీ, కీర్తి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీడీ రాజా పేర్కొన్నారు.

పాడిపరిశ్రమ సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే ఆదిమూలం



పశుగణన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాడి పరిశ్రమ సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్మమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శుక్రవారం నారాయణవనంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో తలపెట్టిన పశు గణన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు వైద్య అధికారులు, సిబ్బందికి రైతులు తమ వద్ద పశువుల వివరాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణవనం, పాలమంగళం పశువైద్యాధికారులు డాక్టర్ భార్గవి, ఎస్.ఏ.కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇలంగోవన్ రెడ్డి, నాయకులు జయచంద్ర నాయుడు, పద్దురాజు, భక్తవత్సలం నాయుడు, ఎంఎస్ రవి పాల్గొన్నారు.

28న పుత్తూరులో జాబ్ మేళా

పుత్తూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ, సీడప్‌లు సంయుక్తంగా పట్టణంలోని హిమజ కళాశాలలో ఈ నెల 28వ తేదీ సోమవారం జాబ్ మేళా నిర్వహించనున్నాయని కళాశాల చైర్మన్ సురేంద్రరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదు బహుళ జాతీయ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని వివరించారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజల్ సేవ

నారాయణవనం, అక్టోబర్ 25(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో వెలసిన కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల్ సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి, పద్మావతి అమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా ఉదయం నిత్య కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛరణతో ఊంజల్ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

అమెరికాలో భానుప్రకాష్‌కు ఘన స్వాగతం



నగరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు అమెరికా విమానాశ్రయంలో తెలుగువారు ఘనంగా స్వాగతం పలికారు. 10 రోజులపాటు అమెరికా పర్యటనకు వెళ్లిన ఆయన్ను టీడీపీకి చెందిన ప్రవాసాంధ్రులు సాదరంగా ఆహ్వానించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

పంటకాలువ కబ్జాపై ఫిర్యాదు

పెళ్లకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నేపల్లి పాపానాయుడు చెరువు నుంచి పంట పొలాలకు సాగు నీరందించే కాలువను ఆక్రమణదారులు కబ్జా చేసినట్లు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యానికి రైతులు ఫిర్యాదు చేశారు.

మోటర్ సైకిల్ ర్యాలీ

వెంకటగిరి టౌన్, అక్టోబరు 25,(ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని పురష్కరించుకుని 9వ బెటాలియన్ అడిషనల్ కమాం డెంట్ అరుణ్ బోస్ ఆధ్వర్యంలో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించరాదు



ఎస్ఐ మల్లికార్జున

వరదయ్యపాళెం, అక్టోబరు 25: దీపావళి సందర్భంగా అనుమతులు లేకుండా బాణ సంచా విక్రయాలు జరిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వరదయ్యపాళెం ఎస్ఐ మల్లికార్జున హెచ్చరించారు. అక్రమంగా అమ్మ కాలు సాగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: విజయశ్రీ



ఆస్పత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, అక్టోబరు 25: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ హెచ్చరించారు. శుక్రవారం నాయుడుపేట పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని ఆమె తనిఖీ చేశారు. ముందుగా రోగులు ఉన్న గదిలోకి వెళ్లగా అక్కడ ఇనుప మంచాలపై పడుకొని ఉన్న రోగులకు దుప్పట్లు వేయకపోవడంతో ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులు పరిశీలించి రోగులు తక్కువ రావడంతో సిబ్బందిని పిలిపించి ఆరా తీశారు. రోగులకు తగిన సౌకర్యాలు లేవని వారు తెలపడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. రోగులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి వైద్యాధికారి చంద్రకళ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు శిరసనంబేటి విజయ భాస్కర్‌రెడ్డి, షేక్ రఫీ, నెలవల రాజేష్, పార్థసారథి, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కామిరెడ్డికి గంగాప్రసాద్‌ను విమర్శించే స్థాయి లేదు: పాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్‌ను విమర్శించే స్థాయి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డికి లేదని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, సత్యవేడు నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపునకు గంగాప్రసాద్ ఎంతో కృషి చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కామిరెడ్డి ఎన్నో అక్రమాలు, అవినీతికి పాల్పడ్డారన్నారు. అనేక కేసుల్లో నిందితుడుగా ఉన్న కామిరెడి నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, వెంకటేశ్వర్లురెడ్డి, పట్టాభి రామిరెడ్డి, నరసింహులు నాయుడు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంగాప్రసాద్‌ను విమర్శించడం తగదు

పెళ్లకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, ప్రముఖ వ్యాపారవేత్త కొండేపాటి గంగాప్రసాద్‌ను విమర్శిచడం ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డికి తగదని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, ఆ పార్టీ సీనియర్ నాయకుడు పేరం రమేష్‌నాయుడు అన్నారు. శుక్రవారం వారు పెళ్లకూరులో మీడియాతో మాట్లాడారు.

వృత్తి నైపుణ్యంతో రైతులకు సేవలు అందించాలి



రైతులకు నిర్వహించిన శిక్షణ

వడమాలపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యంతో రైతులకు సేవలు అందించాలని జిల్లా వ్యవసాయ వనరులు కేంద్రం జిల్లా ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ భాస్కరయ్య కోరారు. పుత్తూరు డివిజన్ పరిధిలో పనిచేస్తున్న వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు, వడమాలపేట ఎంపీడీవో సమావేశ మందిరంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆధునిక సాగు పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందించి సేవలు అందించాలని కోరారు. వాననీటి సంరక్షణ, సహజవనరుల సంరక్షణ, సూక్ష్మ నీటిపారుదల జీవన ఎరువులు, జీవ సంబంధ చేయడం నివారణ మందులు డ్రోన్ల వినియోగంపై రైతులకు వివరించి, ఆచరించి అధిక దిగుబడులు పొందేందుకు సహకరించాలని సూచించారు. వ్యవసాయ పరిశోధన స్థానం పెరుమాళ్ల పల్లె శాస్త్రవేత్త డాక్టర్ నాగమణి సాగులో చీడల అదుపుచేసే చర్యల గురించి వివరించారు. వేరుశనగలో మేలైన యాజమన్యం గురించి వివరించారు. పుత్తూరు ఉద్యాన అధికారి సౌజన్య మామిడి, కూరగాయలు, లిల్లీ, మల్లె పంటలలో చేపట్టవలసిన చీడల నివారణ గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో వేణుగోపాలరావు వరి సాగులో చేపట్టవలసినా సాగు పద్ధతులు, కలుపు నివారణ గురించి వివరించారు. శిక్షణ ముగింపులో, సిబ్బందికి పరీక్ష నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏవోలు విజయ్‌కుమార్, కోదండయ్య, శోభ, హరిత, స్రవంతి పాల్గొన్నారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్



ఎస్.సి.రాఘవేంద్ర, సీనియర్ సివిల్ జడ్జి

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): పుత్తూరు కోర్టు ఆవరణలో డిసెంబరు 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి. రాఘవేంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతాయని వివరించారు. ఈ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు. క్రిమినల్ కేసులను కూడా రాజీ చేసుకోవచ్చిని వివరించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలీసులు, న్యాయవాదులు సంయుక్తంగా ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలని సూచించారు.

ఉచిత ఇసుక విధానం అద్భుతం : పోతుగుంట విజయ్‌బాబు



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పుత్తూరు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానం అత్యద్భుతమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు పేర్కొన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం స్థానిక కార్వేటినగరం రోడ్డు కూడలిలో భవన నిర్మాణ కూలీలతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సీనరేజ్‌తో పాటు జీఎస్టీ రద్దు చేసి సామాన్యులకు అండగా నిలిచారని తెలియజేశారు. భవన నిర్మాణాలు పెరిగి కూలీలకు ఉపాధి దొరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర మంగళం ఎంపీటీసీ శ్రీజ బాలాజీ నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధనపాల్, మాజీ ఎంపీటీసీ పాండురంగయ్య, టీఎన్‌టీయూసీ జిలాల కార్యదర్శి అరవప్రకాష్, నియోజకవర్గ మహిళా కార్యదర్శి నాగరత్నమ్మ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు విజయ్ శేఖర్‌నాయుడు, మధుసూదన్‌రాజు, హచ్ విజయ్, శంఖునాదన్, సుబ్రమణ్యం, కుమార్ రెడ్డి శేఖర్ రెడ్డి మణికంఠ, పోతుగుంట అప్పయ్య పోతుగుంట కృష్ణమనాయుడు, పోతుగుంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇకనైనా ఎన్నికలు జరిగేనా..?

నిర్వీర్యం అవుతున్న సహకార సంఘాలు



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

పుత్తూరు టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు కోసం రైతుల సహకారంతో ఏర్పాటు చేసిన వ్యవసాయ సహకార సంఘాలు పాలక వర్గాలు లేక పదేళ్లుగా నిర్వీర్యం అవుతున్నాయి. 1985లో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులు భాగస్వామ్యం చేస్తూ ప్రతి మండలానికి ఒకటి, రెండు సహకార సంఘాలను ఏర్పాటు చేశారు. ఈ సంఘాల ద్వారా రైతులే పాలకవర్గాలను ఎన్నుకుని వాటి ద్వారా పంట రుణాలు, సాగుకు కావాల్సిన ఎరువులను, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు రాయితీపై పొంది ఎంతో లబ్ధిపొందేవారు. అయితే గత కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వంలో పాలకవర్గాలను పక్కన పెట్టి తమ నాయకులకు, కార్యకర్తలకు ఇష్టారాజ్యంగా నామినేటెడ్ పోస్టులను అప్పగించడంతో ఈ సహకార సంఘాలు నిర్వీర్యం అయ్యాయి. పుత్తూరు మండలంలో తడుకు, పీఆర్ మంగళం, చెర్లోపల్లి, రాచపాళెంలో మొత్తం మండల పరిధిలో 4 సహకార సంఘాలు ఉన్నాయి. సుమారు 10 నుంచి 20 గ్రామాల రైతులు ఒక్కో సహకార సంఘం నుంచి సేవలు పొందేవారు. పదేళ్లుగా పాలకవర్గం లేక పథకాలు పొందలేకపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అయినా ఎన్నికల జరిపించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

ప్రజలకు రుణపడి ఉంటా: కురుగొండ్ల



డి.వడ్డిపల్లిలో సమస్యలపై సర్పంచుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

డక్కిలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు తాను జీవితాంతం రుణపడి ఉంటానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మండలంలోని దేవుడువెల్లంపల్లి, డి.వడ్డిపల్లి, లింగసముద్రం గ్రామాల్లో శుక్రవారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. దేవునివెల్లంపల్లిలో రూ.10 లక్షలు, లింగసముద్రంలో రూ.5లక్షల వ్యయంతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే డి.వడ్డిపల్లి గ్రామంలో రూ.35 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్ల మాట్లాడుతూ తనకు మూడోసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన ప్రజలను మరవలేనని చెప్పారు. ముఖ్యంగా 750 ఓట్లకు పైగా మెజారిటీ ఇచ్చి తన గెలుపునకు సహకరించిన డి.వడ్డిపల్లి గ్రామాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఎస్ఎస్ఆర్ నాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి, సర్పంచు చెంచమ్మ, టీడీపీ నాయకులు యువరాజ్, వెంకటపతి, చంద్రారెడ్డి, శ్రీరాములు, పెంచలనరసయ్య, నాగభూణం నాయుడు, తిరుపాల్ నాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

దేవాలయ కమిటీల్లో బ్రాహ్మణులకు చోటు హర్షణీయం



రామమోహన్‌రావు

గూడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల కమిటీల్లో సభ్యులుగా బ్రాహ్మణులకు చోటు కల్పిస్తూ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయానికి ఆదిశంకర బ్రాహ్మణ సేవా సంఘం తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని సంస్థ గౌరవాధ్యక్షుడు, సీనియర్ ఆడిటర్ శ్రీకంటి రామమోహన్ రావు అన్నారు. శుక్రవారం స్థానిక త్యాగరాజవీధిలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో రాష్ట్రంలోని దేవాలయాల కమిటీల్లో బ్రాహ్మణకు చోటు కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

ఆరుగురు విద్యార్థులకు స్వల్పగాయాలు

నాయుడుపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఆరుగురు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. మండలంలోని వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు ఆటోలో నాయుడుపేట కళాశాలకు వెళ్తుండగా మూర్తిరెడ్డిపాళెం సమీపంలో లారీ ఢీకొంది. ఈప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బల్లవోలులో గ్రామసభ

చిల్లకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లవోలులో శుక్రవారం గ్రామసభ నిర్వ హించారు. కొంత మంది రైతులు తమ పేర్లు 1-బీ అండగల్‌లో నమోదు కాలేదని, దీంతో ఏపీఐఐసీ కేటాయించిన భూములను నష్టపరిహారం చెల్లించలేదని తహసీల్దారు శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. రీసర్వేలో భూముల విస్తీరణంలో హెచ్చు, తగ్గులు రావడంతో నష్ట పోయామని పలు వురు రైతులు తెలి పారు. గ్రామసభలో అందిన వినతు లను త్వరితగతిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చెప్పారు.

కామిరెడ్డీ శవ రాజకీయాలు మానుకో: టీడీపీ

కోట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి శవ రాజకీయాలు మానుకోవాలని టీడీపీ నేతలు హితవుపలికారు. కోటలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడారు. మచ్చలేని నాయకుడైన కొండేపాటి గంగాప్రసాద్‌ను కామిరెడ్డి విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. సమావేశంలో టీడీపీ అధ్యక్షుడు మండల సర్వోత్తమరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ పాల్గొన్నారు.

మద్యం షాపును మరో చోటుకు మార్చండి

చిట్టమూరు, అక్టోబర్ 25(అంధజ్యోతి): మండల కేంద్రంలో కూడలి ప్రాంతమైన కొత్తగుంటలో ఏర్పాటు చేసిన మద్యం షాపును మరోచోటుకు మార్చాలని చిట్టమూరు సర్పంచు మీదూరు కోటయ్య, గ్రామస్తులు తహసీల్దారు ప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

చెంగాళమ్మ సేవలో న్యాయమూర్తి

సూళ్లూరుపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని శుక్రవారం నెల్లూరు జిల్లా ఎస్సీ ఎస్టీ ఐదవ అదనపు న్యాయమూర్తి సరస్వతి దర్శించుకొన్నారు.

చదువు, తిండి, నిద్ర అన్నీ భోజన హాలులోనే

ఎస్సీ బాలికల హాస్టల్లో సమస్యల తిష్ట ● పెచ్చులూడుతున్న పైకప్పు

పనిచేయని వాటర్ ప్యూరిఫయర్ ● వెలగని లైట్లు

పుత్తూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పుత్తూరులోని ఎస్సీ బాలికల హాస్టల్ భవనం సమస్యలకు నిలయంగా వుంది. 40 ఏళ్ల నాటి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. అధికారుల పట్టించుకోకపోవడంతో విద్యార్థినులు సమస్యలతోనే చదువు సాగిస్తున్నారు. మండల అభివృద్ధి కార్యాలయం పక్కనే బాలికల సంక్షేమ వసతి గృహం ఉంది. దాదాపు 80 మంది బాలికలు వున్నారు. భవనంలోని గదులన్నింటి పైభాగాన పెచ్చులు ఊడిపోయాయి. ఎప్పుడు అవి ఊడిపడుతాయోననే భయంతో గదుల్లో ఉండడం లేదు. గదుల్లో పుస్తకాలు, దుస్తులను మాత్రం పెట్టుకుంటున్నారు. తినడం, చదవడం, నిద్రపోవడం అన్నీ భోజనం చేసే హాలులోనే. ఇక తాగేందుకు మంచినీటి కోసం దాతలు ఇచ్చిన వాటర్ ప్యూరిఫయర్ పనిచేయడంలేదు. హాస్టల్‌లో బోరు లేకపోవడంతో మున్సిపల్ కొళాయి నీళ్లే వినియోగిస్తున్నారు. హాస్టల్ భవనం ముందు లైట్లు కొంత కాలంగా వెలగడంలేదు. రాత్రిళ్లు పాముల బెడద ఆందోళన కలిగిస్తోంది. అధికారులు స్పందించి హాస్టల్లో వసతులు కల్పించాలని, మున్సిపల్ అధికారులు లైట్లు ఏర్పాటుచేయాలని, విద్యార్థినులు కోరుతున్నారు.









పెచ్చులు ఊడిన పైభాగం, నిరుపయోగంగా మూలపడిన వాటర్‌ప్యూరిఫైయర్, తాగేందుకు కాచిన వేడి నీరు, తినడం, నిద్రపోయేది ఈ హాలులోనే

తిరుపతి విమానాశ్రయ అభివృద్ధికి కృషి చేయండి


కేంద్రమంత్రికి వినతిపత్రం ఇస్తున్న హరిప్రసాద్

రేణిగుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయ అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాదవ్ కోరారు. శుక్రవారం కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న కేంద్రమంత్రి తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 3గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. ఆ సందర్భంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అందుకు రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ తిరుపతి విమానాశ్రయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కాగా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు తిరుపతి విమానాశ్రయంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు సాదర వీడ్కోలు పలికారు. ఆయన ఇండిగో విమానంలో ఢిల్లీకి వెళ్లారు.

ఇసుక రవాణా జరగకుండా ముందస్తు చర్యలు



ఏర్పేడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తవీరాపురం స్వర్ణముఖి నది ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా తహసీల్దార్ భార్గవి ఆదేశాలతో రెవెన్యూ అధికారులు శుక్రవారం ట్రెంచ్ కొట్టించారు. సొంత అవసరాలకు కాకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

ఏర్పేడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజిమేడు గ్రామానికి చెందిన సుబ్బరామిరెడ్డి గుండె, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ తిరుపతిలో సుమారు రూ.2లక్షలు వెచ్చించి వైద్యం చేయించుకున్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సహకారంతో ముఖ్య మంత్రి సహాయనిధి కింద రూ.1,04,000 మంజూరైంది. ఆ చెక్కును బాధితుడు సుబ్బరామిరెడ్డికి ఎమ్మెల్యే అందించారు. సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మన్‌కీబాత్ క్విజ్ విజేతలకు బహుమతుల ప్రదానం



రేణిగుంట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రేణిగుంటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం విష్ణువర్ధని ఆధ్వర్యంలో ప్రధాని మోదీ మన్‌కీ బాత్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభచూపిన 40మంది విద్యార్థినులకు బీజేపీ నాయకులు బహు మతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, మండలాధ్యక్షులు తేజోవతి, బీజేపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శీనప్ప, జితేందర్‌రెడ్డి, బాలాజీ, వెంకటాద్రియాదవ్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు కళలకు ప్రాధాన్యం

శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఎంజీఎం విద్యాసంస్థలో విద్యతో పాటు కళలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు డైరెక్టర్ గుడ్లూరుమయూర్ అన్నారు. ఎంజీఎం విద్యాసంస్థలో శుక్రవారం ఇంటర్నేషనల్ ఆర్టిస్ట్‌డే సందర్భంగా విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసపత్రాలు, నగదు బహుమతిని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డ్రాయింగ్ మాస్టర్ ముని పరశురామ్, ప్రిన్సిపాల్ వెంకటరత్నం పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం చంద్రబాబు

శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం 12 మంది బాధితులకు రూ.11.6లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణపై అవగాహన కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

సత్యవేడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులు, అవలంబించాల్సిన ఆధునిక పద్ధతులపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ సిబ్బందిపై ఉందని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక అగ్రిల్యాబ్‌లో ఏడీఏ సుబ్ర మణ్యం ఆధ్వర్యంలో డివిజన్‌లోని సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం మండలాలకు చెందిన వ్యవసాయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవోలు మురళి, ద్వారకానాథ్, సంజీవరెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పశువుల సమగ్ర వివరాలు అందించండి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని ఊరందూరులో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువైద్య సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చిన సమయంలో తమ వద్దనున్న పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, వ్యవసాయ సామగ్రి వంటి వివరాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్‌వీ శ్రీకాంత్‌బాబు, డాక్టర్ ఊహ, రవీంద్రవర్మ, అరుణ్‌కుమార్, ఉషా, శరత్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాన్ని విజయవంతం చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న గురవారెడ్డి

శ్రీకాళహస్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నవంబరు 26న సభ్యత్వ నమోదు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రూ.100 సభ్య త్వం తీసుకుంటే ప్రమాదబీమా రూ.5లక్షలు, అంత్యక్రియల ఖర్చులకు రూ.10వేలు వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాచేటి సుబ్రహ్మణ్యం, ఈశ్వర్‌రెడ్డి, మునెయ్య, బత్తెయ్యఆదవ్, సదా శంకర్‌నాయుడు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు అరుదైన గౌరవం


కోట చంద్రశేఖర్

శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ చొరవతో నాయీబ్రాహ్మణులకు అరుదైన గౌరవం దక్కిందని టీడీపీ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి, తిరుపతి పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ క్యాబినెట్ సమావేశంలో నాయీ బ్రాహ్మణులకు అన్ని ఆలయాల పాలకమండలిలో సభ్యులుగా అవకాశం కల్పించేలా తీర్మానం చేయడం సంతోషకరమన్నారు.

ఘనంగా శుక్రవార ఉత్సవం


అమ్మవారి ప్రాకార ఉత్సవం

శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువుదీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రావణమాసం కావడంతో మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. మధ్యాహ్నం దాతలు భక్తులకు అన్నదానం చేశారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు



శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలం పై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి వివిధ పూజా ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి దీపారాధన చేశారు. లలితా సహస్ర నామం పఠించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

తమిళనాడు ఆర్టీసీ బస్సుకు తప్పిన పెనుప్రమాదం


గాయపడిన డ్రైవర్, దెబ్బతిన్న బస్సు

రేణిగుంట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఆర్టీసీ బస్సుకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం ఉదయం చెన్నై నుంచి ప్రయాణికులతో తిరుపతికి వస్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సు తిరుచానూరు హైవేపై తూకివాకం పెట్రోల్‌బంకు సమీపంలో లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ముందువెళుతున్న కంటైనర్‌ను, తర్వాత డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. బస్సు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అతడిని 108లో రుయా ఆస్పత్రికి తరలించారు.

అధికారులూ.. ఇకనైనా మేల్కొంటారా..!



మీరు చూస్తున్నది బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని కేటీరోడ్డులోని పదవ మైలు నడిరోడ్డుపై ఏర్పాటు చేసిన వాషింగ్ మిషన్. దాన్ని చూసి వాహనదారులు షాక్ అవుతున్నారు. ఎవరు ఇలా పడేశారని చర్చించుకుంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. అసలు విషయం ఏమిటా అని ఆరా తీస్తే.. పదవ మైలు వద్ద రోడ్డులో భారీ గుంత ఏర్పడింది. ఆ గుంత ప్రమాదకరంగా ఉంది. ఆ గుంతను పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో పాడైపోయిన వాషింగ్ మిషన్ బాక్సును ఎవరో గుంతలో ఉంచి వాహనదారులకు ప్రమాద హెచ్చరికగా ఏర్పాటు చేశారు. మరి అధికారులు ఇకనైనా మేల్కొంటారో లేదో చూడాలి.!

- బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి)

రాజేంద్ర కుటుంబాన్ని ఆదుకుంటాం : సుధీర్‌రెడ్డి


బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఐదేళ్ల కుమారుడితో పాటు మృతి చెందిన రాజేంద్ర కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం తొట్టంబేడు మండలం చియ్యవరంలోని రాజేంద్ర ఇంటికి వెళ్లారు. రాజేంద్ర భార్య గురమ్మను ఓదార్చారు. ఇతర కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గురు పిల్లలను చదివిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియాతో పాటు ఒక ఎకరా భూమిని ఇచ్చేందుకు కృషిచేస్తామన్నారు. ఇదిలా ఉండగా స్థానిక ప్రజలతో మాట్లాడారు. సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

దోపిడీ కేసులో నలుగురి అరెస్టు



శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇద్దరిపై దాడి చేసి రెండు సెల్‌ఫోన్లను లాక్కుని పరారైన కేసులో పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి కథనం మేరకు.. పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో పానగల్ ప్రాంతంలో వారం రోజుల క్రితం పెళ్లకూరు మండలం ఆర్లపాడు గ్రామానికి చెందిన తరుణ్, తేజా అనే ఇద్దరిపై నలుగురు వ్యక్తులు ఆకస్మికంగా దాడి చేశారు. వారి నుంచి రెండు స్మార్ట్‌ఫోన్లు, రూ.250 నగదును లాక్కుని పరారయ్యారు. శ్రీకాళహస్తికి చెందిన పెరుమాల్, బాలాజీ, రాహుల్, కోమల్ అనే నలుగురు యువకులు దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని మిట్టకండ్రిగ వద్ద నలుగురు యువకులను ద్విచక్రవాహనాలతో పాటు అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు తరలించారు.

కూనాటి సురేష్‌కు అరుదైన అవకాశం



శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కూనాటి సురేష్‌కు అరుదైన అవకాశం లభించింది. జాతీయ విద్యాపరిశోధన, శిక్షణ సంస్థ వారు ఈ నెల 28, 29వ తేదీలలో న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సుకు అమరావతిలోని ప్రభుత్వ సంచాలకుల ద్వారా ప్రత్యేక ఆహ్వానం అందింది.

యోగా రాష్ట్రస్థాయి పోటీలకు కనపర్తి విద్యార్థిని



శ్రీకాళహస్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం పెద్ద కనపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని మీనాక్షి శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 విభాగంయోగా పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. నవంబరులో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం తెలిపారు. మీనాక్షిని పలువురు అభినందించారు.

ముక్కంటి సేవలో డైరెక్టర్ ఆఫ్ జనరల్ అకౌంటెంట్


ఆలయం వద్ద కె.సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం న్యూఢిల్లీకి చెందిన డైరెక్టర్ ఆఫ్ జనరల్ అకౌంటెంట్ కె.సుబ్రహ్మణ్యం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

యూటీఎఫ్ మండలాధ్యక్షుడిగా శశికుమార్


సమావేశమైన యూటీఎఫ్ నాయకులు

వరదయ్యపాళెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండలాధ్యక్షుడుగా శశికుమార్‌ను ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు సూర్యప్రకాష్, జిల్లా సభ్యులు మోహన్‌బాబు, శివకుమార్, విజయకుమార్ పాల్గొన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శశికుమార్, ప్రధాన కార్యదర్శిగా సురేష్ భగవాన్, గౌరవాధ్యక్షులుగా రామకృష్ణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అక్రమ నిర్మాణానికి అధికారుల బ్రేక్


అక్రమ నిర్మాణాలనుఅడ్డుకుంటున్న అధికారులు

వరదయ్యపాళెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెంలో ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన నాలుగంతస్తుల భవన నిర్మాణాన్ని అధికారులు అడ్డుకున్నారు. చిలమత్తూరు గ్రామంలో తమిళనాడుకు చెందిన వ్యక్తి నాలుగంతస్తుల భవన నిర్మాణం చేపట్టాడు. అయితే మూడంతస్తులకే అనుమతులు పొందాడు. సర్పంచ్ ప్రవీణ ఫిర్యాదు మేరకు అధికారులు అక్కడికి చేరుకుని నిర్మాణానికి సంబంధించి అప్రూవల్ అడిగారు. అనుమతులు లేకుండా నిర్మించకూడదని భవన యజమానికి సూచించారు. భవన యజమాని వారితో దురుసుగా వ్యవహరించాడు. దీంతో సర్పంచ్ ప్రవీణ, పంచాయతీ కార్యదర్శి పద్మనాభరాజుతో కలిసి ఆ భవన నిర్మాణాన్ని అడ్డుకున్నారు. నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు.

నేడు కీళపూడిలో ఉచిత వైద్య శిబిరం

పిచ్చాటూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కీళపూడి పాత కమ్యూనిటీ భవనం ఆవరణం వద్ద శనివారం ఉదయం 9 నుంచి మధ్యా హ్నం 1 గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అన్న గౌరి ఆస్పత్రి యాజమాన్యం శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేసింది.

మంజూరైన రోడ్ల పనులు వెంటనే ప్రారంభించండి


సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ డీఈ

కేవీబీపురం, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): మంజూరైన రోడ్ల పనులు వెంటనే ప్రారంభించాలని పంచాయతీ రాజ్ డీఈ గోపి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాధారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి రూ.2కోట్ల పనులు మంజూరైందన్నారు. ఇన్‌చార్జి తహసీల్దారు మునిరత్నంరెడ్డి మాట్లాడుతూ ఇసుక కావాల్సిన వారు ముందుగానే తహసీల్దారు కార్యాల యంలో పర్మిట్లు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామాంజునాయుడు, గోపీనాథ్‌రెడ్డి, మునస్వామియాదవ్, బీజేపీ మండలాధ్యక్షుడు మునిశేఖర్ యాదవ్, జనసేన థామస్, పీఆర్ ఏఈ ప్రవీణ్‌కుమార్, కాంట్రాక్టర్లు, సర్పంచులు, పాల్గొన్నారు.